క్లుప్తంగా

ఎల్ఐసీ ఉద్యోగుల నిరసన



నిజామాబాద్ రూరల్: దేశీయ బీమా రంగంలో వందశాతం విదేశీ పెట్టుబడులను అనుమతిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం ఐసీఈయూ ఆధ్వర్యంలో నగరంలోని ఎల్లమ్మగుట్టలో ఉన్న ఎల్ఐసీ కార్యాలయం ఎదుట ఉద్యోగులు నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎన్‌పీఎస్‌ను రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డి సురేశ్, పి శంకర్, సామ్రాట్, టి శ్రీనివాస్, టి గంగాధర్ పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగుపడాలి



మోపాల్: విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగుపడేలా బోధన చేపట్టాలని ఎంఈవో గేమ్‌సింగ్ సూచించారు. మంగళవారం మండలంలోని సిర్పూర్ ప్రాథమిక పాఠశాలను ఎంఈవో పరిశీలించారు. తరగతి గదుల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. ఆయన వెంట హెచ్ఎం నాగమణి, ఉపాధ్యాయులు రాము, వసంత, అనురాధ తదితరులు ఉన్నారు.

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



ధర్పల్లి: సిరికొండ మండల కేంద్రంలో బీజేపీ నాయకులు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ చిత్రపటాలకు మంగళవారం పాలాభిషేకం చేశారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులు అన్ని వర్గాల వారికి మేలు చేర్చేలా ఉన్నాయని నాయకులు అన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజేశ్వర్, గంగారెడ్డి, సంజీవ్, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

యోగా కేంద్రంలో సూర్య నమస్కారాలు



నిజామాబాద్ రూరల్: రథసప్తమిని పురస్కరించుకొని నగరంలోని సుభాష్‌నగర్‌లో ఉన్న దయానంద యోగా సెంటర్‌లో యోగా గురువు రాంచందర్ ఆధ్వర్యంలో 108 సూర్య నమస్కారాలు చేశారు. కార్యక్రమంలో యోగా టీచర్స్ గురుపాదం, అశోక్‌కుమార్, మురళి, మురళి గుప్తా, శ్రీనివాస్ గుప్తా, తోట రాజశేఖర్, జగన్మోహన్, నర్సయ్య పాల్గొన్నారు.

రామకృష్ణ విద్యానికేతన్‌లో..

నిజామాబాద్ రూరల్: రథసప్తమిని పురస్కరించుకొని స్థానిక శివాజీనగర్‌లో ఉన్న శ్రీ రామకృష్ణ విద్యానికేతన్‌లో మంగళవారం విద్యార్థులతో సూర్య నమస్కారాలు చేయించారు. కార్యక్రమంలో సముద్రాల శ్రీనివాస చారి, శశిరేఖ, మధుసూదన్, మాధురి, విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రులు, ఎంపీలకు సన్మానం



సుభాష్‌నగర్: బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి నియమితులైన దినేశ్ పటేల్ కులాచారి మంగళవారం ఢిల్లీలో కేంద్ర మంత్రులు జి కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కుమార్, రాజ్యసభ సభ్యుడు కె లక్ష్మణ్, నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తనను నియమించినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కేంద్రమంత్రులు, ఎంపీలను సన్మానించారు. దినేశ్ పటేల్ కులాచారిని కేంద్రమంత్రులు సన్మానించి అభినందించారు. ఆయన వెంట జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి తదితరులు ఉన్నారు.





ఆలయంలో దర్శనం కోసం క్యూ కట్టిన భక్తులు



ఆలయంలో శివలింగం ప్రతిమ

భక్తి శ్రద్ధలతో రథసప్తమి

- ప్రత్యేక పూజలు, అభిషేకాలు
- కనుల పండువగా నీలకంఠేశ్వరుని రథోత్సవం
- శివనామ స్మరణతో మారుమోగిన ఆలయ ప్రాంగణం



ఆలయంలో భక్తుల సందడి



కంఠేశ్వర్‌లో రథాన్ని లాగుతున్న భక్తులు

నిజామాబాద్ రూరల్/ మోపాల్: జిల్లాలో రథ సప్తమి వేడుకలను మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నగరంలోని నీలకంఠేశ్వర ఆలయంలో ఉదయం నుంచి భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. సాయంత్రం స్వామి వారి రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. రథాన్ని లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. భక్తులు తమ కోరికలు నెరవేరాలంటు తొట్లెను రథానికి కట్టారు. రథానికి అర్చకులు సుహాస్ మకరంద్ పూజలు చేశారు. ఆలయ సమీపంలో ఉన్న తల్లి గౌరీ వరకు రథాన్ని ఊరేగించారు. శివనామ స్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. ఆలయ ఆవరణలో జాతర ఏర్పాటు చేయగా పలు దుకాణాలు వెలిశాయి. దీంతో కంఠేశ్వర్, పాలిటెక్నిక్ కళాశాల ప్రాంతం సందడిగా మారింది. కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్‌చార్జి సహాయ కమిషనర్ శ్రీరామ్ రవీందర్ గుప్తా, అర్చకులు నీలేశ్ కులకర్ణి, శేఖర్, సాయి కిరణ్, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

నేడు చక్రతీర్థం

నీలకంఠేశ్వర స్వామి చక్రతీర్థం బుధవారం నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు సుహాస్ తెలిపారు. ఉదయం 9 గంటలకు శివపార్వతుల విగ్రహాలను ఆలయ కోనేరు వరకు ఊరేగింపుగా తీసుకెళ్తామన్నారు. ఆలయ మహా మండపంలో స్వామి వారికి పుష్పయాగం, సప్తవర్ణాల సేవ చేపడుతామని అన్నారు. కార్యక్రమాన్ని భక్తులు విజయవంతం చేయాలని కోరారు.

మోపాల్ మండలంలోని నర్సింగ్‌పల్లిలో ఉన్న ఇందూరు తిరుమల గోవింద వనమాల శ్రీ వేంకటేశ్వర స్వామి క్షేత్రంలో రథసప్తమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్వామివార్లను సూర్యప్రభ వాహనంపై ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు రోహిత్ కుమారాచార్య, విజయ్ స్వామి, ఆలయ ప్రతినిధులు రాజేశ్వర్, భూమ్‌రెడ్డి పాల్గొన్నారు. నగరంలోని జెండాగల్లీలో ఉన్న జెండా బాలాజీ ఆలయంలో రథసప్తమిని పురస్కరించుకొని శ్రీలక్ష్మీగోదాదేవి సహిత శ్రీవెంకటేశ్వర స్వామి వారి రథోత్సవం కన్నుల పండుగా జరిగింది. కార్యక్రమంలో అర్చకులు నాగరాజచారి, ఆలయ కార్యనిర్వహణ అధికారి వేణు, గోపాల్, నర్సింగ్ రావు, జూనియర్ అసిస్టెంట్ ప్రశాంత్‌కుమార్, ఆంజనేయులు, రఘునాథ్ కులకర్ణి పాల్గొన్నారు.



పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న మహిళలు



రథానికి తొట్లె కడుతున్న భక్తులు



నర్సింగ్‌పల్లిలో..



జెండాబాలాజీ ఆలయంలో..



బ్రహ్మపురిలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో..

లక్ష డప్పులు వేల గొంతుల పోస్టర్ ఆవిష్కరణ



మోపాల్‌లో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

డిచ్‌పల్లి/ మోపాల్: ఎస్సీ వర్గీకరణ అమలుకు ఈ నెల 7న హైదరాబాద్‌లో నిర్వహించే లక్ష డప్పులు వేల గొంతుల సాంస్కృతిక మహాప్రదర్శన జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు సంపత్, తెయూ ఎంఎస్ఎఫ్ అధ్యక్షుడు దినేశ్ మంగళవారం యూనివర్సిటీలో ఆర్ట్స్ కళాశాల ఎదుట వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు సైమన్‌పాల్, నవదీప్, చక్రియాదవ్, నరేశ్, సిద్ధార్థ, శేఖర్, ప్రసాద్, నందన్, హర్ష పాల్గొన్నారు. మోపాల్ మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు రొడ్డ ప్రవీణ్ ఆధ్వర్యంలో లక్ష డప్పులు-వేల గొంతులు కార్యక్రమ గోడప్రతులను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పెద్దోళ్ల యమున, పిడుగు మహేశ్, రొడ్డ గౌతమ్, దమ్మడి గంగారాం, బొంకన్ శేఖర్, అదరంగి రాహుల్, సంజీవ్, ఎల్లయ్య, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ యూనివర్సిటీలో..

ఇందూరును సుందరంగా తీర్చిదిద్దాలి



నిజామాబాద్ సిటీ: ఇందూరు నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దాలని, చెత్తరహిత నగరంగా మార్చాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ జయకుమార్ సూచించారు. మంగళవారం బల్దియా కార్యాలయంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జోన్ల వారిగా జరుగుతున్న పారిశుధ్య పనులను రివ్యూ చేశారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికుల హాజరు, విధులు వంటి వాటిని అడిగి తెలుసుకున్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని సూచించారు. సమావేశంలో శానిటరీ సూపర్‌వైజర్ సాజిద్ అలీ, ఇన్‌స్పెక్టర్లు మహేశ్, శ్రీకాంత్, మహిపాల్, షాదుల్లా పాల్గొన్నారు.

బల్దియాలో వేగంగా పన్ను వసూళ్లు

- ప్రత్యేక టీమ్‌లతో రంగంలోకి దిగిన అధికారులు
- సర్కిళ్ల వారీగా నోడల్ ఆఫీసర్లు
- 26 వేల మందికి నోటీసులు జారీ



పన్నులు వసూలు చేస్తున్న రెవెన్యూ బృందం



రెవెన్యూ సిబ్బందితో రివ్యూ చేస్తున్న డిప్యూటీ కమిషనర్

నిజామాబాద్ సిటీ: ఆర్థిక సంవత్సరం ముగియడానికి కొద్ది రోజులే ఉండటంతో బల్దియా అధికారులు పన్ను వసూళ్లను వేగవంతం చేశారు. ఆస్తి, నీటి పన్ను, పెండింగ్ బకాయిలు, పెండింగ్ బకాయిలపై ఫైన్‌లు వసూలు చేస్తున్నారు. పన్ను వసూళ్లపై మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రాజేంద్రకుమార్ రెవెన్యూ సిబ్బందితో రివ్యూ నిర్వహించారు.

సర్కిళ్ల వారీగా స్పెషల్ టీమ్‌లు

కార్పొరేషన్ పరిధిలో 5 సర్కిళ్లు ఉన్నాయి. సర్కిళ్ల వారీగా స్పెషల్ టీమ్‌లను ఏర్పాటు చేశారు. డిప్యూటీ కమిషనర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, డిప్యూటీ మున్సిపల్ ఇంజినీర్, శానిటరీ సూపర్‌వైజర్లతో కూడిన నోడల్ ఆఫీసర్లను నియమించారు. ఇందులో బల్దియాలో పనిచేసే ప్రతి ఉద్యోగిని నియమించారు. పన్ను వసూళ్లకు బల్దియాలోని ఉద్యోగులకు స్పెషల్ డ్యూటీలు వేశారు.

50 శాతం వసూలు చేయాలి

బల్దియాకు రావాల్సిన పన్నులను వెంటనే వసూలు చేయాలని అధికారులు ఒత్తిడి పెంచారు. మొత్తం చెల్లించాల్సిన వాటిలో ముందుగా 50 శాతం వెంటనే చెల్లించేలా చూడాలని మిగతా 50 శాతం పన్నుల కోసం 10 రోజుల గడువు ఇవ్వాలని సూచించారు. మిగతా సొమ్ము కోసం చెక్‌లు తీసుకోవాలని అధికారులు సూచించారు. బల్దియాకు పన్నులు చెల్లించకుండా ఉన్న వారిని 26 మందిని గుర్తించారు. వారికి రెడ్ నోటీసులు జారీచేశారు. ఇప్పటి వరకు 20 వేల మందికి నోటీసులు జారీ అయ్యాయి. మిగతా వారికి కూడా త్వరలోనే నోటీసులు ఇవ్వనున్నారు.

పన్నులు చెల్లించాలి



నగరవాసులు వారికి సంబంధించిన పన్నులను వెంటనే చెల్లించాలి. ఆయా డివిజన్లలో వార్డు ఆఫీసర్లకు, జోన్ కార్యాలయాల్లో కూడా చెల్లించవచ్చు. ప్రత్యేక బృందాల ద్వారా పన్నులు వసూలు చేపట్టాం. పెండింగ్ బకాయిలు కూడా వసూలు చేస్తున్నాం. సకాలంలో పన్నులు చెల్లించకుంటే దుకాణాలు సీజ్ చేయాల్సి వస్తుంది.

– రాజేంద్రకుమార్, డిప్యూటీ కమిషనర్

రూ. 32 కోట్లు వసూలు చేయాలి

బల్దియాకు 2024–25 ఆర్థిక సంవత్సరం రూ. 50 కోట్ల పన్నుల రూపేనా రావాల్సి ఉంది. ఇప్పటి వరకు కేవలం రూ.18 కోట్ల వసూలు చేశారు. రూ. 32 కోట్ల వరకు పన్నులు వసూలు చేయాల్సింది. వాటితో పాటు మరో రూ.60 కోట్ల వరకు మొండి బకాయిలున్నాయి. వీటిని కూడా వసూలు చేయాలని అధికారులు సూచిస్తున్నారు. డివిజన్ల వారీగా కూడా పన్నులు వసూలు చేస్తున్నారు. ఇందులో రూ. 50 వేలకు లోపు పన్నులను డివిజన్ వారిగా వార్డు ఆఫీసర్లు వసూలు చేస్తున్నారు. రూ.50 వేలకు మించిన పన్నులను స్పెషల్ ఆఫీసర్లు, నోడల్ ఆఫీసర్లు వసూలు చేపడుతున్నారు.

దేశానికి క్యాన్సర్ సవాలుగా మారింది



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ రోహిత్

నిజామాబాద్‌నాగారం: సర్వేకల్ క్యాన్సర్ దేశానికి ప్రజారోగ్య సవాలుగా మారనున్నదని, దీనిని నివారించడానికి ప్రభుత్వం, సామాజిక సేవా కార్యకర్తలు కృషి చేయాలని ప్రముఖ రేడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ రోహిత్ అన్నారు. మంగళవారం వరల్డ్ క్యాన్సర్ డే సందర్భంగా దాస్‌నగర్‌లోని మహిళా రెసిడెన్షియల్ కాలేజీలో మల్లు స్వరాజ్యం మెమోరియల్ ట్రస్ట్, తెలంగాణ ఆల్ పెన్షనర్స్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. క్యాన్సర్ నివారణకు ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జాతీయ అధ్యక్షుడు రామ్మోహన్‌రావు, మల్లు స్వరాజ్యం ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ రవీంద్రనాథ్ సూరి, కాలేజీ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరావు, కె రామ్మోహన్రావు, మదన్మోహన్, నారాయణ, అద్దంకి ఉషాన్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జయకుమార్‌కు శానిటరీ పర్యవేక్షణ బాధ్యతలు



నిజామాబాద్ సిటీ: మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన జయకుమార్‌కు మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్ అదనపు బాధ్యతలు అప్పగించారు. ఏఎంసీతోపాటు జయకుమార్‌కు పారిశుధ్య పనుల పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించారు. బల్దియాకు రెండేళ్లుగా పూర్తిస్థాయి ఎంహెచ్‌వో లేకపోవడంతో పారిశుధ్య పనులు కుంటుపడ్డాయి. దీంతో ప్రతి రోజు ఉదయం రోజుకో డివిజన్ చొప్పున కమిషనర్ దిలీప్‌కుమార్ స్వయంగా తనిఖీ చేస్తున్నారు. జయకుమార్ బల్దియాలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా చాలా సంవత్సరాలుగా పని చేశారు. పదోన్నతిపై అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్‌గా జయకుమార్ ఈనెల 1న బాధ్యతలు తీసుకున్నారు.

'ఎస్సీ వర్గీకరణకు మాలలు వ్యతిరేకం'



నిజామాబాద్‌నాగారం: రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్మానం చేయడాన్ని నిరసిస్తూ జిల్లా మాలమహానాడు ఆధ్వర్యంలో మంగళవారం కంఠేశ్వర్‌బైపాస్ చౌరస్తాలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర కోకన్వీనర్ ఎడ్ల నాగరాజు, జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వం వర్గీకరణ బిల్లుకు ఆమోదం తెలపడం సరికాదన్నారు. ప్రభుత్వం మాలలకు న్యాయం చేయాలని లేకుంటే పెద్ద ఎత్తున నిరసనలు చేపడతామని అన్నారు. కార్యక్రమంలో ఉదయ్‌కుమార్, సి దేవిదాస్, వినయ్, గంగాధర్, చంద్రకాంత్, సుమన్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ



ఉపాధి హామీ సామాజిక తనిఖీలో పాల్గొన్న అధికారులు

ధర్పల్లి: మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులపై 15వ విడత సామాజిక తనిఖీని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి డీఆర్డీవో సాయాగౌడ్ ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరించారు. గతేడాది మండలంలోని 22 గ్రామాల్లో చేపట్టిన వివిధ పనులపై నివేదికలను చదివి వినిపించారు. పనులపై తనిఖీ నిర్వహించగా ఉపాధి హామీ సిబ్బంది పని ప్రదేశంలో కొలతల్లో తేడాలు, మాస్టర్ల నిర్వహణలో తప్పిదాలను ఉపాధి హామీ సామాజిక బృందం సభ్యులు గుర్తించారు. అవకతవకలు జరిగిన గ్రామాల్లో ఉపాధి హామీ సిబ్బంది నుంచి డబ్బుల రికవరీకి ఆదేశించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి నారాయణ, ఎంపీడీవో బాలకృష్ణ, ఎంపీవో రాజేశ్, ఏపీవో వినోద, సామాజిక తనిఖీ బృందం సభ్యులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ

నిజామాబాద్ రూరల్: మండలంలోని తిర్మన్‌పల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో సరస్వతి విగ్రహ ఏర్పాటుకు కొండూరు గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థులు మంగళవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్లు అందజేత

ఖలీల్‌వాడి: నగరంలోని ఆరవటౌన్ పీఎస్ పరిధిలో తొమ్మిది సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న వారికి ఎస్సై వెంకట్రావు మంగళవారం అందజేశారు. ఎస్సై మాట్లాడుతూ.. మొబైల్ ఫోన్లు పోయిన వారు సీఈఐఆర్ యాప్‌లో ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసి సెల్‌ఫోన్లను రికవరీ చేస్తామన్నారు. కార్యక్రమంలో పీసీ యాస్మిన్, సిబ్బంది ఉన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	85,300	వెండి(కిలో)	98,000
22 క్యారెట్స్	78,717	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సడ్	200
		లైవ్	160
స్కిన్‌లెస్	240	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	6	12	గాజరుగడ్డ	40	60
బెండకాయ	40	80	పచ్చిమిర్చి	40	60
బీరకాయ	40	80	దోసకాయ	30	50
దొండకాయ	35	50	ఆలుగడ్డ	20	40
బీర్నిసుకాయ	40	60	గోబిగడ్డ	10	20
కాకరకాయ	30	50	గోబిపువ్వు	20	40
వంకాయ	30	50	బీట్‌రూట్	30	50
పాలకూర	10	20	కరివేపాకు	50	100
మెంతికూర	15	30	చామగడ్డ	40	80
కొత్తిమీర	10	20	గోరుచిక్కుడు	40	80
పుదీనా	40	80	చిక్కుడుకాయ	40	60
క్యాప్సికం	40	60			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-2	సంక్రాంతికి వస్తున్నాం(తెలుగు)-11.00, 1.40, 4.40, 7.25, 10.00
స్క్రీన్-3	ఏజెంట్ గై 001(తెలుగు)-11.00 4.40 మదగజరాజ(తెలుగు)-1.30 ,7.30 10.20

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	సంక్రాంతికి వస్తున్నాం (తెలుగు)-10.30, 1.30, 4.30, 7.30, 10.30
స్క్రీన్-2	మదగజరాజ(తెలుగు)-10.10 10.45 డాకు మహారాజు (తెలుగు)-1.20 7.40 - దేవా(హిందీ)-4.25
స్క్రీన్-3	దేవా(హిందీ)-10.45 7.15 10.30 మహిష(తెలుగు)-2.00 రొమాంటిక్ లైఫ్(తెలుగు)-4.30
స్క్రీన్-4	ఏజెంట్ గై001(తెలుగు)-11.15 స్కై ఫోర్స్(హిందీ)-1.30 10.25 మదగజరాజ(తెలుగు)-4.15 ప్రేమిస్తావా(తెలుగు)-7.25
లలితామహల్	మదగజరాజ (తెలుగు)
దేవి	డాకు మహారాజు(తెలుగు)
నటరాజ్	రాచరికం(తెలుగు)
విజయ్	సంక్రాంతికి వస్తున్నాం (తెలుగు)